RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, జూలై 13, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 80 | పేజీలు: 8 | వెల : రూ.1




మూడింటిలో 2 కార్పొరేషన్లపై గురి

# కేసీఆర్‌కు ఏమైంది..



హైదరాబాద్, జూలై 12, (వాయిస్ టుడే) తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయింది. తెలంగాణను సాధించి.. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్లు పాలించిన కేసీఆర్‌ను కొట్టడం ఎవరికీ సాధ్యం కాదనుకున్నారు. కేసీఆర్, కేటీఆర్ కూడా బీజేపీపై ఫోకస్ పెట్టారు. కానీ రేవంత్‌రెడ్డి బాహుబలిలా షాక్ ఇచ్చాడు. బలమైన కేసీఆర్‌ను ఒంటిచేత్తో ఓడించాడు. రెండున్నరేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితిలో కేజీఆర్ రాజకీయ జోష్యాలు చెబుతూ మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస ప్రభుత్వమే.. ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే అంటూ చెప్పుకుంటున్నారు. ఇవి తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏమీ చేయలేదని, తెలంగాణ ప్రజలు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ పాలనను పోల్చి చూసుకుంటున్నారని పేర్కొంటున్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిలో రేవంత్ సగం కూడా చేయలేదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయన్న ధీమా కేటీఆర్‌లో కనిపిస్తుంది. కానీ, రెండున్నరేళుల ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్.. రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యే పరిస్థితిపై సందిగ్ధం నెలకొంది. కేసీఆర్‌ను ఇక శాశ్వతంగా ఫామ్‌హౌస్‌కే పరిమితం చేస్తామని రేవంత్ అంటున్నారు.ఎన్నికలు కేవలం ప్రత్యర్థి అనుభవ లోపాలపై ఆధారపడి జరుగవు. నాయకత్వం, కమ్యూనికేషన్, స్థానిక శ్రేణులలోని శక్తి సమీకరణం, సందర్భోచిత సంఘటనలు కూడా ఫలితాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి కాంగ్రెస్ విఫలమైందనే కారణంతో బీఆర్‌ఎస్ నిర్బంధ విజయమనే జోస్యం తాత్కాలికమే. కేసీఆర్ కూతురు పార్టీ నుంచి బయటకు వచ్చి ధైర్యంగా రాజకీయాలు చేస్తున్నారు. కేటీఆర్ మాత్రం ఇప్పటికీ తండ్రి పేరు చెప్పుకుంటున్నారు. కేసీఆరే కాబోయే ముఖ్యమంత్రి అంటున్నారు. తనను తాను సీఎంగా ప్రొజెక్టు చేసుకోలేకపోతున్నారు.బీఆర్‌ఎస్‌కి పెద్ద పట్టు ఉన్నా, కుటుంబ రాజకీయాలకు సంబంధించిన అనుబంధ, అంతర్గత విభాగాల ఒత్తిళ్లు, కవిత వంటి నాయకత్వ కొత్త అంశాలు పార్టీకి కొత్త సవాళ్లు తీసుకురావచ్చు. ఒక పార్టీకి నిరంతరంగా అధికారంలో ఉండటానికి సమర్థ నాయకత్వానికి తోటి స్థాయి వ్యూహపరమైన నవీనత, యువ శ్రేణుల ఆకర్షణ, పాలనా ప్రదర్శనలో నిరంతర ఉత్తేజం అవసరం. బహుశా ప్రస్తుతం బీఆర్‌ఎస్ కీలకంగా కనిపించినా, గెలుపు హామీ సులభంగా చెప్పలేం.తెలంగాణలో బీజేపీ ప్రభావం కూడా పెరిగింది. కేంద్ర స్థాయి మద్దతు, వనరుల వినియోగం, స్థానిక మద్దతుదారుల ఆకర్షణ వ్యూహాలు చివరికి స్థానిక బలహీనతలను ఉపయోగించవచ్చు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అంటోంది. బెంగాల్ తర్వాత తెలంణపై ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో బీఆర్‌ఎస్ కాంగ్రెస్ వైఫల్యాలను నమ్ముకోవడం కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.తెలంగాణ రాజకీయ స్థితి ఒకే పరీక్ష పెడుతున్న సమయం. ఈ సమయంలో పార్టీని, క్యాడర్‌ను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులపై ఉంది. మరో ఏడాది గడిస్తే ఎన్నికల మూడ్ వస్తుంది ఆలోగా బలోపేతం కాకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది.

# సిటీలో వాకర్స్‌కు కష్టమే...



హైదరాబాద్, జూలై 12, (వాయిస్ టుడే) : మన దేశంలో చాలా వరకు ఫుట్ పాత్ లు ఆక్రమణకు గురై ఉంటాయి. ఈ నేపథ్యంలోప్రధాన నగరాల్లో పాదచారులకు అనుకూలమైన ఫుట్‌పాత్ లు ఎక్కడెక్కడ ఉన్నాయో 'స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ 2026' ఓ నివేదిక ను విడుదల చేసింది. పాదచారులకు సురక్షితంగా, సౌకర్యవంతంగా నడిచే ఫుట్‌పాత్‌లు ఎంత మేర అందుబాటులో ఉన్నాయనే అంశంపై ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ అధ్యయనం ప్రకారం దేశంలో అనుకూలమైన ఫుట్‌పాత్ లు ఈ నగరంలో ఉన్నాయో చూద్దాం..స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ ప్రకారం..ఫుట్‌పాత్ ల నిర్వహణ దేశంలోని ఎంపిక చేసిన నగరాల్లో పాదచారులకు అనువైన ఫుట్‌పాత్‌ల శాతంలక్నో 28%, బెంగళూరు 25.9%,హైదరాబాద్ 15.1%, చెన్నై 13.9%, ముంబై, 5.5% గా ఉన్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే లక్నోలో పాదచారుల కోసం మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండటం వల్ల మొదటి స్థానంలో నిలిచింది. నగర ప్రణాళికలో పాదచారుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ విజయానికి ప్రధాన కారణంగా పేర్కొన్నారు.ఐటీ హబ్‌గా పేరొందిన బెంగళూరు 25.9 శాతం ఫుట్‌పాత్‌లతో రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ 15.1 శాతంతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. నగరంలో కొన్ని ప్రధాన రహదారులపై ఆధునిక ఫుట్‌పాత్‌లు అభివృద్ధి చేసినప్పటికీ, ఇంకా విస్తృత స్థాయిలో మెరుగుదల అవసరమని నివేదిక సూచించింది.చెన్నై 13.9 శాతంతో నాలుగో స్థానంలో ఉండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబై కేవలం 5.5 శాతంతో చివరి స్థానానికి పరిమితమైంది. అధిక జనసాంద్రత, రహదారులపై ఆక్రమణలు, పరిమిత స్థలం వంటి కారణాల వల్ల ముంబైలో పాదచారులకు అనువైన ఫుట్‌పాత్‌లు చాలా తక్కువగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.భారత నగరాల్లో ఎక్కువ మంది రోజూ నడిచి ప్రయాణాలు చేస్తున్నప్పటికీ, వారికి తగిన ఫుట్‌పాత్‌లు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్రమణలు, పార్కింగ్, నిర్మాణ పనులు, అసమానమైన ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని నివేదిక వెల్లడించింది.

**నివేదిక సూచించిన మార్గదర్శకాలు**

పాదచారులకు అనుకూలమైన నగరాల అభివృద్ధి కోసం అన్ని నగరాల్లో వెడల్పైన, నిరంతరాయంగా కొనసాగే ఫుట్‌పాత్‌లు, దివ్యాంగులకు అనువైన ర్యాంపులు, జీబ్రా క్రాసింగ్‌లు, సురక్షిత రోడ్డు దాటే సౌకర్యాలు, మెరుగైన వీధి లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను పెంచాల్సిన అవసరం ఉందని 'స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ 2026' నివేదిక స్పష్టం చేసింది. పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే నగరాలు నిజమైన అర్థంలో ప్రజలకు అనుకూలంగా మారతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



వాయిస్ ఆఫ్ ప్రజలు

సోమవారం, జూలై 13, 2026





# తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి కావాలి.. ప్రతి ఎన్నికలో జనసేన పోటీ చేస్తుంది: తాళ్లూరి రామ్

భద్రాద్రి కొత్తగూడెం, వాయిస్ టుడే న్యూస్: తెలంగాణలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే ముఖ్యమంత్రి కావాలనే నినాదంతో జనసేన పార్టీ ప్రజాక్షేత్రంలోకి వెళ్తోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ స్పష్టం చేశారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలతో పాటు తెలంగాణలో జరిగే ప్రతి ఎన్నికలో జనసేన పోటీ చేస్తుందని, ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి తాను ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెంలోని డాక్టర్ గడల శ్రీనివాస్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి తాళ్లూరి రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ముందు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన నాయకులు, అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాళ్లూరి రామ్ చేతుల మీదుగా జనసేన జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించగా, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

సభలో మాట్లాడిన తాళ్లూరి రామ్, తెలంగాణలో బీసీలు జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ రాజకీయ అధికారానికి దూరంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని, బీసీ ముఖ్యమంత్రి నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముందుగా తమ పార్టీ పాలనలో జరిగిన అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. వ్యక్తిగత విమర్శల కంటే ప్రజా సమస్యలపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణలో గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేస్తున్నామని, ప్రతి మండలం, గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేసి యువత, మహిళలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేన ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని, ప్రతి స్థానంలో బలమైన అభ్యర్థులను నిలబెట్టి ప్రజల ఆశీర్వాదం పొందేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజల మద్దతుతో విజయం సాధించేలా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేస్తామని పేర్కొన్నారు.

### ఖమ్మం కార్యకర్తల అంకితభావం అమూల్యం: నేమూరి శంకర్ గౌడ్

జనసేన తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యకర్తల అంకితభావం పార్టీకి గొప్ప బలమని అన్నారు. ఇటీవల పార్టీలో చేరిన డాక్టర్ గడల శ్రీనివాస్ రావు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా విస్తృత పర్యటనలు నిర్వహించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.

### ఉద్యమాల ఖిల్లా ఖమ్మంలో జనసేన జెండా ఎగురుతుంది: సాగర్ ఆర్.కె. నాయుడు

జనసేన ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ, ఉద్యమాలకు కేంద్రబిందువైన ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి జనసేనకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎన్నికలో పోటీ చేసి ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తామని తెలిపారు.

### కొత్తగూడెం నుంచే జనసేన జైత్రయాత్ర ప్రారంభం: డాక్టర్ గడల శ్రీనివాస్ రావు

ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ గడల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తెలంగాణలో జనసేన విస్తరణకు కొత్తగూడెం కేంద్రంగా మారుతుందని చెప్పారు. పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తూ, గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని పటిష్టం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం, చుంచుపల్లి మండలాలకు చెందిన సుమారు 200 మంది యువకులు, మహిళలు జనసేన పార్టీలో చేరగా, రాష్ట్ర నాయకులు వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కోఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ, రాష్ట్ర నాయకులు మచ్చా సుధాకర్, మేకల సతీష్ రెడ్డి, సురేష్ రెడ్డి, తనీష్, మంథని సంపత్, గోకుల రవీందర్, బండి నరేష్, తాడికొండ లిఖిత, నల్లా సురేష్, దాసరి రవీష్, షేక్ ఫరీద్, విజయ రామారావు, రాము యాదవ్, హసీనా, జయశ్రీ, సాదిక్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# బ్యాంకాక్ పబ్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 27 మంది మృతి

**మరో 63 మందికి తీవ్ర గాయాలు.. 22 మంది పరిస్థితి విషమం**

**దట్టమైన పొగ కారణంగా ఊపిరాడకే ఎక్కువ మంది మృతి**

**ఫైర్ ఎగ్జిట్ వద్ద అడ్డంకుల వల్లే భారీగా ప్రాణనష్టం**

**షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా**



థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. నగరంలోని ఓ ప్రముఖ పబ్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 27 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 63 మంది తీవ్రంగా గాయపడ్డారు. పబ్ ప్రవేశ ద్వారం వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగి, భవనం మొత్తం దట్టమైన పొగ కమ్ముకోవడంతో లోపల ఉన్నవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఉత్తర బ్యాంకాక్‌లోని 'నా లాడ్‌ప్రావ్' పబ్‌లో ఈ దుర్ఘటన జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సుమారు 30 నిమిషాల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన బ్యాంకాక్ గవర్నర్ చాడ్‌చార్ట్ సిట్టిపంత్ మాట్లాడుతూ.. మంటలు వేగంగా పైకప్పు వరకు వ్యాపించాయని, దట్టమైన పొగ కారణంగా ఊపిరాడకపోవడమే అధిక మరణాలకు ప్రధాన కారణమని తెలిపారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉందని ఆయన వెల్లడించారు. చాలా మృతదేహాలు పబ్ వెనుక ఉన్న రెస్ట్‌రూమ్‌లలో లభ్యమైనట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర ద్వారం (ఫైర్ ఎగ్జిట్) వద్ద కొన్ని అడ్డంకులు ఉండటంతో, లోపల ఉన్నవారు బయటకు రాలేకపోయారని అధికారులు భావిస్తున్నారు. థాయ్‌లాండ్ ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్ ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఓ మ్యూజీషియన్ ఆయనతో మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి ముందు స్టేజ్ పక్కన ఉన్న సర్క్యూట్ బ్రేకర్ నుంచి పొగలు రావడం చూశానని, ఆ వెంటనే పెద్ద పేలుడు వినిపించిందని వివరించాడు. ఈ ప్రమాదంలో తన బ్యాండ్‌లోని ఒకరు మరణించగా, మరొకరి ఆచూకీ తెలియడం లేదని స్థానిక గాయని సుకన్య వాంగ్‌వాంగ్వాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు వ్యాపించగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంతా చీకటిమయమైందని, పొగ వల్ల ఏమీ కనిపించక చాలామంది లోపలే చిక్కుకుపోయారని బాధితులు చెబుతున్నారు. పబ్ యాజమాన్యం భద్రతా నిబంధనలను ఉల్లంఘించిందా అనే కోణంలో అధికారులు సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు.

# విజయవాడలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి

**విజయవాడ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం**

**అగ్నికి ఆహుతైన ఏడు ప్రైవేట్ బస్సులు**

**మెకానిక్ షెడ్‌లో మొదలైన మంటలు**

**ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు**

**ఘటనపై కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు**



నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సులకు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.



# వియత్నాం ప్రమాదం: ఈ రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్న తెలుగు పర్యాటకులు

వియత్నాంలో శనివారం జరిగిన ఘోర పడవ ప్రమాదం నుంచి బయటపడిన తెలుగు పర్యాటకులంతా సురక్షితంగా హనోయిలోని నోయ్ బాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరంతా ఆదివారం రాత్రి 7:05 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానంలో బయల్దేరి, భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకల్లా హైదరాబాద్ చేరుకోనున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఫు క్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 15 మంది భారతీయులు మృతిచెందగా, వారిలో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారు. ఓ మొబైల్ ఫోన్ కంపెనీ తమ డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన విహారయాత్రలో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బోటులో మొత్తం 32 మంది ఉన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏపీకి చెందిన గెల్లి కిశోర్ అనే వ్యక్తి వియత్నాంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితులను వీలైనంత త్వరగా వారి స్వస్థలాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మరోవైపు, మరణించిన 15 మంది భారతీయుల మృతదేహాలను హో చి మిన్ నగరానికి తరలిస్తున్నట్లు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ఆదివారం వెల్లడించింది. అక్కడ అవసరమైన లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత, మృతదేహాలను వీలైనంత త్వరగా భారత్‌కు పంపిస్తామని పేర్కొంది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, ఏపీ ప్రభుత్వం, న్యూఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు బాధితులకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారు.




# మూడింటిలో 2 కార్పొరేషన్లపై గురి

హైదరాబాద్, జూలై 12, (వాయిస్ టుడే) : తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత 1955 నాటి యాక్ట్‌ను రద్దు చేసి పాత గ్రేటర్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300 కి పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్‌పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది.ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అత్యంత యువ లీడర్ నితిన్ నవీన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి, రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ , దిశానిర్దేశం చేసి వెళ్లారు. నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు.. ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రేటర్‌ను విభజించడం వెనుక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్ ఉంది. ఓల్డ్ సిటీ పరిధిలోని హైదరాబాద్ , ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్ , ఉద్యోగులు–మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్‌గిరి .. ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇవి కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు.. వారి సొంత రాజకీయ భవిష్యత్తును, ఉనికిని చాటుకోవడానికి ఒక అగ్నిపరీక్ష. అందుకే జాతీయ అధ్యక్షుడి పర్యటన ముగిసిన వెంటనే తెలంగాణ బీజేపీ నేతలంతా గ్రేటర్ మున్సిపల్ పరిధిపై అంతర్గత కసరత్తు తీవ్రం చేశారు. గత 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పుడు బీఆర్ఎస్ బాగా బలహీనపడిన తరుణంలో.. ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లకుండా పూర్తిగా తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ ముందున్న అసలైన టాస్క్.కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ , మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో ఐటీ ఉద్యోగులు, వలస ప్రజలు, ఇతర రాష్ట్రాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ సెగ్మెంట్ సాంప్రదాయకంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇష్టపడుతుంది కాబట్టి, ఇక్కడ క్షేత్రస్థాయిలో సరైన అభ్యర్థులను నిలబెడితే మేజర్‌గా లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బూచీని చూపిస్తూ గ్రేటర్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యాయి.ఈ త్రిముఖ కార్పొరేషన్ పోరు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ గమనాన్ని మార్చనుంది. కాంగ్రెస్ అధికార బలాన్ని, వ్యూహాలను తట్టుకుని నిలబడాలంటే బీజేపీ కేవలం సోషల్ మీడియా పాలిటిక్స్ నమ్ముకుంటే సరిపోదు.. క్షేత్రస్థాయిలో రోడ్ల పైకి వచ్చి పోరాడాల్సి ఉంటుంది. జాతీయ నాయకత్వం పంపిన అల్టిమేటంతో అప్రమత్తమైన తెలంగాణ బీజేపీ లీడర్లు.. ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావించి సరికొత్త కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఒకవేళ ఈ మూడు స్థానాల్లో బీజేపీ మెజారిటీ సాధిస్తే.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కుతుందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

# రాష్ట్రంలో కేసీఆర్ పాలన రావాలని కొమురవెల్లి మల్లన్నకు బీఆర్ఎస్ నేతల ప్రత్యేక పూజలు

హైదరాబాద్ : జులై 12(వాయిస్ టుడే): రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన ముగిసి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ గోశామహల్ బీఆర్ఎస్ నాయకులు కొమురవెల్లి మల్లన్న స్వామికి అభిషేకం నిర్వహించి, కొండ పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాంబాగ్ బీఆర్ఎస్ సీనియర్ నేత అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గోశామహల్ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఇన్‌చార్జి నాగేందర్ గౌడ్, గోశామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆర్వీ మహేందర్ కుమార్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు సుమారు 50 కార్లతో కొమురవెల్లికి చేరుకుని మల్లన్న స్వామికి అభిషేకం చేసి, కొండ పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుత ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని, కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. గోశామహల్ నుంచే కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేసిన ఆయన, రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలనే ప్రజల ఆకాంక్ష రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఈ లక్ష్యంతో గోశామహల్ బీఆర్ఎస్ నాయకులు సంఘటితంగా దైవ పూజలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. నరేందర్ యాదవ్, సురేష్ ముదిరాజ్, శివ, కిషోర్, సీమా శంకర్, గణేష్, రమేష్ గుప్తా, లక్ష్మణ్, శంకర్, రాము తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## నిజాంపేట్ 2BHK డిగ్నిటీ గృహాల్లో మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి రూ.45 లక్షల నిధులు

### - భూమి పూజలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ జూలై 12(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ 2దీఎఖ డిగ్నిటీ గృహాల సముదాయంలో మల్టీపర్పస్ హాల్ నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.45 లక్షల నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి నిరంతర కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరు కావడం పట్ల 2దీఎఖ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా 2దీఎఖ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మల్టీపర్పస్ హాల్ నిర్మాణ స్థలంలో ప్రత్యేక భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొలన్ హన్మంత్ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం కమిటీ సభ్యులు కొలన్ హన్మంత్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి, కాలనీ అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, “నిజాంపేట్ 2దీఎఖ లబ్ధిదారుల సౌకర్యార్థం మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి రూ.45 లక్షల నిధులు మంజూరు కావడం ఎంతో సంతోషకరం. పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, కాలనీల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ఈ నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కుత్బుల్లాపూర్ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను” అని అన్నారు ఈ కార్యక్రమంలో 2దీఎఖ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ నివాసితులు పాల్గొన్నారు.



## రాంపల్లిలో పేదల స్థలంలో డంపియార్డ్.. అడ్డు కోవాలని ఎంపి ఈటెలకు వినతిపత్రం

నాగారం, జూలై 12:-(వాయిస్ టుడే): రాంపల్లి సర్వే నం. 226లో కుమ్మరి, వడ్డెరి, ఎరుకల వంటి పనిముట్ల కులాలకు గతంలో ప్రభుత్వం సుమారు 8 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం అదే స్థలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేయడాన్ని గ్రామస్థులు, ఆయా కుల సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఘనపురం శ్యామసుందర్ శర్మ ఆధ్వర్యంలో కుమ్మరి--వడ్డెరి--ఎరుకల పనిముట్ల సంఘాల ప్రతినిధులు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ప్రభుత్వం కేటాయించిన భూములను రక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఈ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల జీవనాధారం ఈ భూములతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న కాలనీ మధ్యలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హానికరమని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కీసర ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడిన ఈటెల రాజేందర్ రాంపల్లిలో కుమ్మరి, వడ్డెరి, ఎరుకల కులాల జీవనాధారానికి సంబంధించిన భూముల జోలికి వెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తాను స్వయంగా రాంపల్లికి వచ్చి ధర్నాలో పాల్గొని ఉద్యమానికి నాయకత్వం వహిస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా కుమ్మరి, వడ్డెరి, ఎరుకల సంఘాల కోసం ఎంపీ నిధుల ద్వారా మొత్తం రూ.30 లక్షలు (ప్రతి సంఘానికి రూ.10 లక్షలు చొప్పున) కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి మంజూరు చేసినట్లు ఈటెల రాజేందర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ మునిగంటి సురేష్, నాగారం డివిజన్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు బొమ్మిడి బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు రామారంగిరి గౌడ్, భరత్ ముదిరాజ్, మల్యాల మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## రాంపల్లిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈ నెల 14న దర్నా

నాగారం, జూలై 12:-(వాయిస్ టుడే): రాంపల్లిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 14 మంగళవారం రాంపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించే దర్నాను జయప్రదం చేయాలని నిర్వహకులు తెలిపారు. ఈ దర్నాలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. ఈ ధర్నా పోస్టర్ ని వివిధ కాలనీల గ్రూపులలో మరియు వాట్సప్ స్టేటస్ కూడా పెట్టండి సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు.



## పదేళ్ల కింద ఇచ్చినట్లు ఇప్పుడు ఇస్తే కుదరదు.. ప్రస్తుతం ఉన్న రేట్ల కనుగుణంగా జీతభత్యాలు ఇవ్వాలి

### ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో మిడ్ డే మీల్స్ కుక్కింగ్ వర్కర్స్ ధర్నాలో మాట్లాడిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు

నాచారం (వాయిస్ టుడే): జీవో నెంబర్ 94 ప్రకారం మిడ్ డే మీల్స్ గైడ్లెన్స్ సెంట్రల్ గైడ్లెన్స్ తప్పకుండా అమలు చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు మిడ్ డే మీల్స్ వర్కర్స్ కు గౌరవ వేతనంగా పదివేల నుండి 17వేల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది ఏళ్ల కింద ఇచ్చినట్టు ఇప్పుడు ఇస్తే కుదరదని ప్రస్తుతం ఉన్న రేట్లు కనుగుణంగా ఇవ్వాలని కోరారు.తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ స్కూల్స్ మిడ్ డే మీల్స్ కుకింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ధర్నా చేపట్టారు. భారీగా హాజరైన మధ్యాహ్న భోజన కార్మికులను ఉద్దేశించి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు మాట్లాడుతూ మీ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు మీ పక్షాన బిజెపి పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ స్కూల్స్ మిడ్ డే మీల్స్ కుకింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్ల హనుమన్లు మాట్లాడుతూ.. జీవో నెంబర్ 94 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయి వరకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్షయ పాత్రకు సెంట్రలైజ్డ్ కిచెన్ సిస్టం ను అప్పజెప్పడం వలన మిడ్ డే మీల్స్ కార్మికులు ఏజెన్సీలకు తీవ్ర నష్టం జరుగుతు న్నందున వెంటనే జీవో నెంబర్ 6, జీవో నెంబర్ 19 ని వెంటనే రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వంట కార్మికులకు 17 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో 94 ప్రకారం తాసిల్దార్ ద్వారా వంట కార్మికులకు ఐడి కార్డు ఇవ్వాలని, ఇతర కార్మికులకు ఉన్నట్టుగా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా సమస్యలను పరిష్కరిస్తానని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి బాబాయ్, మంజుల, సంతోష గంగాధర్ వెంకటేష్ వరలక్ష్మి శ్రీశైలం గంగామణితోపాటు మిడ్ డే మీల్స్ వర్కర్స్ భారీగా పాల్గొన్నారు.




## సర్ సందేహాలకు హెల్ప్ డెస్క్

హైదరాబాద్ :జూలై 12;(వాయిస్ టూ డే) : బాగ్ అంబర్‌పేట్‌లో సర్ హెల్ప్‌డెస్క్ కార్యక్రమం నిర్వహణ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఖీతీ) కార్యక్రమంలో భాగంగా ఈరోజు బాగ్ అంబర్‌పేట్ డివిజన్‌లోని మల్లికార్జున్నగర్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఖైరతాబాద్ డీసీసీ ఉపాధ్యక్షురాలు ఆర్. సునీత రెడ్డి గారి ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్ హాజరై మాట్లాడారు. ప్రతి ఓటరు తన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ూ×= ప్రక్రియలో భాగంగా అవసరమైన ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సకాలంలో నింపి సమర్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాగ్ అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు రావుల సుధాకర్, సంతోష్ గుప్తా మహేష్ గౌడ్ లావణ్య పద్మమౌనిక తంగావేలు తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మిక్‌నగర్ డివిజన్‌లో ఎస్.ఐ.ఆర్ ఫారాలపై అవగాహన కార్యక్రమం



జూబ్లీహిల్స్ 12 జులై (వాయిస్ టుడే) కార్మిక్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎఫ్ నగర్, ఇంద్రానగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (Special Intensive Revision) కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ప్రజలను కలిసి ఎస్ఐఆర్ ఫారాలను ఎలా సరిగ్గా నింపాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సోహేల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఓటరు జాబితాలో పేరు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లియాకత్ అలీ, అబ్దుల్ సమద్, వినోద్, తిరుపతి,రమేష్..సంజీవ్, అరుణ్, తరుణ్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## చిట్కుల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలి

### సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి బి నాగేశ్వరరావు

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : ఇస్నాపూర్ మున్సిపల్‌లోని చిట్కుల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని, కోర్టులో ఉన్న సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి బి నాగేశ్వరరావు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. నేడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చిట్కుల్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ నిర్మించిన ఇండ్ల సముదాయాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ చిట్కుల్ గ్రామంలో 329 సర్వే నెంబర్లో ఐదు ఎకరాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాన్ని గత 15 సంవత్సరాల క్రితం ప్రారంభం చేసి, ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశారని. డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో భూములు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని, కోర్టులో కొనసాగుతున్న కేసును వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. 329 సర్వే నెంబర్లలో ఇల్లు నిర్మించుకున్న వారికి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని, రెవెన్యూ వారు చేస్తున్న కూల్చివేతలను వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు.బచ్చు గూడెం, కర్దనూరు, పటేల్ గూడా, నాగులపల్లి వేలాది మంది కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎక్కడ స్థానికులకు డబుల్ బెడ్రూంలో ఎందుకు ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని పెండింగ్ లో ఉన్న వాటిని పూర్తిచేసి అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఏరియా కమిటీ సభ్యులు ఆర్ శాంత కుమార్, నల్లగండ్ల రాజు, సిపిఎం పార్టీ నాయకులు జె పోచయ్య,రాజ్ కుమార్ ఇతరులు పాల్గొన్నారు.

## అల్లాపూర్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ఫారాలపై ప్రజలకు అవగాహన

అల్లాపూర్ 12 జులై (వాయిస్ టుడే ): అల్లాపూర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏ. లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు బస్తీలలోని ఎస్ఐఆర్ హెల్ప్ కౌంటర్లను కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలతో కలిసి ఎస్ఐఆర్ ఫారాలను ఎలా సక్రమంగా నింపాలి, అవసరమైన పత్రాలు ఏమిటి, దరఖాస్తు ప్రక్రియను ఎలా పూర్తి చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు అడిగిన సందేహాలకు నాయకులు సమాధానాలు ఇస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేణు, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు వాజీద్ పాషా, సునీత, విజయ్ గౌడ్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఎస్ఐఆర్ ఫారాల భర్తీ ప్రక్రియలో మార్గనిర్దేశం చేశారు.



# SIR మరియు బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్ అంశాలపై నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు

**సదస్సులో శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్**





పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జీఎంఆర్ కన్వెన్షన్‌లో SIR (Special Intensive Revision) మరియు బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్ అంశాలపై నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, SIR కార్యక్రమంపై ప్రతి కార్యకర్త సమగ్ర అవగాహన కలిగి ఉండి, ప్రజలకు సరైన సమాచారం చేరవేయడం అత్యంత బాధ్యతగా భావించాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా ప్రతి అర్హ ఓటరు తన వివరాలను పరిశీలించి, అవసరమైతే ఎన్యుమరేషన్ ఫారం (Enumeration Form)ను పూర్తిగా నింపి సంబంధిత అధికారులకు సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్లు, ఇతర వివరాల సవరణ వంటి అంశాల్లో ప్రజలకు సహకరించాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన డిజిటల్ మెంబర్‌షిప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ సభ్యత్వం ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణం మరింత బలోపేతం అవుతుందని, సాంకేతికతను వినియోగించి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం, యువజన విభాగం, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు మరియు MPR యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వాస్ గ్లోబల్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సెంటర్ ప్రారంభం

**శివం రోడ్ లో వాస్ గ్లోబల్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సంస్థ ఎండి పి అభిషేక్ రెడ్డి**

హైదరాబాద్, జూలై 12;(వాయిస్ టూడే): విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను చదువుకోవడం కోసం కావలసిన సలహాలు సూచనలు ఇవ్వడం, బ్యాంకు రుణాలు పైన వాస్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సంస్థ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అండగా నిలుస్తూ మంచి ఆదరణ పొందాలని ఇందుకోసం నిర్వాకులు అంకిత భావంతో పనిచేయాలని అంబర్పేట ఎమ్మెల్యే ఆలేరు వెంకటేష్ సూచించారు. విదేశీ విద్య పైన అనుభవం కలిగిన పి అభిషేక్ రెడ్డి విద్యానగర్ శివం రోడ్ లో ఏర్పాటు చేసిన వాస్ గ్లోబల్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత విద్యా కోసం విదేశాలకు వెళ్లాలని భావించే గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు వాస్ గ్లోబల్ కన్సల్టెన్సీ సంస్థ అండగా నిలవాలని సూచించారు. వాసు గ్లోబల్ ఎడ్యుకేషన్ సంస్థ ఎండి పి అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ, బీటెక్, పీజీ తో పాటు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్య అందించేందుకు తమ సంస్థ వారిదిగా పనిచేస్తుందని తెలిపారు. తమ సంస్థ ద్వారా విదేశీ విద్యకు వెళ్లే వారికి సరైన మార్గదర్శకాలు తెలియజేయడంతో పాటు, సరేనా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ చదివిన చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి గోవర్ధన్ రెడ్డి, పి.ఎన్.రెడ్డి, సామ్రాట్ నేత తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విధుల్లో ఉన్న బూత్ లెవల్ అధికారులకు అన్నదానం



జూబ్లీహిల్స్ 12 జులై (వాయిస్ టుడే ): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సూచనల మేరకు శ్రీనగర్ కాలనీ డివిజన్‌లోని నాగార్జున కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (Special Intensive Revision) కార్యక్రమం సందర్భంగా, శ్రీనగర్ కాలనీ డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్ బూత్ లెవల్ అధికారులకు (BLO\T) మర్యాదపూర్వకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రజలకు సేవలందిస్తూ విధులు నిర్వర్తిస్తున్న అధికారుల సేవలను అభినందిస్తూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .



## 29 ఏళ్ల తర్వాత కలిసిన రామకృష్ణ హైస్కూల్ 1997 పదో తరగతి పూర్వ విద్యార్థులు

కూకట్ పల్లి : జులై 12(వాయిస్ టుడే): కూకట్‌పల్లి బాగ్ అమీర్‌లోని రామకృష్ణ హైస్కూల్ 1997 పదో తరగతి తెలుగు, ఇంగ్లీష్ మీడియం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. సుమారు 29 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు ముందుగా తమ పాఠశాలలో సమావేశమై చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం కూకట్‌పల్లిలోని ఏటీసీ బ్యాంక్వెట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పాఠశాల కరెస్పాండెంట్ రామకృష్ణ సార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ నర్సా రెడ్డి, జాన్సన్ బాబు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అరుణ, నిర్మల, రాజేశ్వరి, శుక్లాదత్త తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పూర్వ మధుర సంఘటనలను గుర్తుచేసుకుంటూ, పూర్వ విద్యార్థులకు విలువైన సలహాలు, సూచనలు అందించారు. జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ తమ ఆశీర్వాదాలను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థి దశలోని అనుభవాలను, ప్రస్తుత జీవన విశేషాలను ఒకరితో ఒకరు పంచుకుని ఆనందంగా గడిపారు. భవిష్యత్తులో సమాజ సేవా కార్యక్రమాలను చేపట్టడంతో పాటు, తమలో ఎవరికైనా ఎలాంటి అవసరం వచ్చినా పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. ఆప్యాయత, అనుబంధం, ఆత్మీయతల నడుమ ఈ సమ్మేళనం విజయవంతంగా ముగిసింది.

## నైపుణ్యాల మెరుగుతోనే ఉజ్వల భవిష్యత్

**ఓయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి**



హైదరాబాద్, జూలై 12: విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి అన్నారు. అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కాచిగూడ లోని మ్యాడం అంజయ్య హాల్ లో అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. కళాశాలలో చదివి ప్రస్తుతం ఉన్నత శిఖరాలను అధిరోహించిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పాత జ్ఞాపకాలను, అనుభవాలను తొటి విద్యార్థులతో ఉత్సాహంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం విద్యా, ఉపాధి రంగంలో నైపుణ్యాభివృద్ధి అనేది ఎంతో కీలకమైనదని విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు శోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఇండస్ట్రీకి అవసరమైన స్కిల్ బేస్డ్ విద్యను అందించే విధంగా ఓయు కృషి చేస్తుందని ఆయన అన్నారు. 35 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి, విద్యార్థుల పురోభివృద్ధికి అవంతి విద్యా సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రియాంక, డాక్టర్ ఎం.ఎ. హమీద్, సూరంపూడి సోనియా శ్రీకాంత్, ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, జక్కుల సత్యనారాయణ, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ వై.జయప్రద, ప్రొఫెసర్ ఎస్.అప్పారావు, డాక్టర్ స్వాతి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## హరీష్ రావు వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం

**కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్**



హైదరాబాద్: మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవి, బాధ్యతారా హిత్యమైనవి, రాజకీయ సంస్కృతిని దిగజార్చేవని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ తీవ్రంగా విమర్శించారు. ఆధారాలు లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రిపై తీవ్ర ఆరోపణలు చేయడం, నేరస్థులతో పోల్చేలా మాట్లాడటం అత్యంత ఖండనీయమని ఆయన పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ వ్యక్తిత్వ హననం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. హరీష్ రావు ముందుగా తమ పార్టీ పాలనలో చేసిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని జితేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ప్రతిరోజూ నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతు భరోసా పథకం కింద తొమ్మిది రోజుల్లోనే రూ.9,000 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేయడం రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్య సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రస్తావిస్తూ, రైతు భరోసా, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, యువతకు ఉద్యోగాల భర్తీ, సాగునీరు--తాగునీటి సదుపాయాల విస్తరణ, విద్య--వైద్యం--మౌలిక వసతుల అభివృద్ధికి భారీ నిధుల కేటాయింపు, సామాజిక న్యాయం, పారదర్శక పాలన వంటి అంశాల్లో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

ఈ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను రాజకీయంగా తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చించకుండా వ్యక్తిగత ఆరోపణలతో కాలక్షేపం చేయడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ దివాళాకోరుతనాన్ని మాత్రమే బయటపెడుతోందని వ్యాఖ్యానించారు. నిజంగా ఏవైనా ఆధారాలు ఉంటే వాటిని చట్టబద్ధమైన సంస్థల ముందు సమర్పించాలని, మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. హరీష్ రావు తన నిరాధార వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రజలు అసత్య ప్రచారాన్ని కాకుండా అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనను విశ్వసిస్తారని మిద్దెల జితేందర్ స్పష్టం చేశారు.

# పటాన్‌చెరు గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా.. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే: హరీష్ రావు





పటాన్‌చెరు, వాయిస్ టుడే న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని, స్కామ్‌ల ప్రభుత్వం పోయి మళ్లీ సంక్షేమ పథకాల ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ (SIR) అవగాహన సదస్సు మరియు బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు ముందు ముత్తంగి ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వరకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరులు గూడెం మధుసూదన్ రెడ్డి, గూడెం విక్రమ్ రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి హరీష్ రావుకు ఘన స్వాగతం పలికారు. వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులతో నిర్వహించిన ర్యాలీలో "జై తెలంగాణ", "జై కేసీఆర్" నినాదాలతో పటాన్‌చెరు గులాబీమయమైంది.

సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ, ఎన్నికలకు ఇంకా రెండున్నర సంవత్సరాల సమయం ఉన్నప్పటికీ పటాన్‌చెరు బీఆర్ఎస్ శ్రేణులు అందించిన అపూర్వ స్వాగతం మరచిపోలేనిదని అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ద్వారా యావత్ తెలంగాణ దృష్టిని పటాన్‌చెరు వైపు మళ్లించారని కొనియాడారు. "పటాన్‌చెరు గడ్డ అంటే బీఆర్ఎస్ అడ్డా" అని వ్యాఖ్యానించారు.

కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు (BLA\T) చురుకుగా పనిచేసి ప్రతి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన హరీష్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.30 వేల కోట్ల విలువైన భూములను విక్రయించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పేదల సంక్షేమానికి నిధులు కేటాయించకుండా ఇతర కార్యక్రమాలకు భారీగా ఖర్చు చేస్తోందని ఆరోపించారు. సిగాచి పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించలేదని, కంపెనీ యాజమాన్యమే పరిహారం చెల్లించిందని విమర్శించారు. అలాగే బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఐటీ పార్క్ కోసం కేటాయించిన భూములను విక్రయించిందని ఆరోపించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ అంశంపై బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రెండు లక్షల సభ్యత్వాలు నమోదు చేసి పార్టీ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ టీజీఐఐసీ చైర్మన్ బాలమల్లు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 13 జూలై 2026

# సంగీత సామ్రాజ్యంలో సరస్వతి ఎన్. జానకి

హైదరాబాద్, జూలై 12: వేలాది పాటలు పాడి ప్రేక్షకుల, సంగీతప్రియుల హృదయాలను మీటి మానసిక శాంతిని, శాంతిని, ప్రజాచైతన్యాధి ప్రజాద్రి. కలిగించిన "జానకమ్మ మరణం సంగీత జగత్తుకు తీరని లోటుని పాటల రూపంలో వసుదలో వర్ధిల్లుతూ ఉంటుదని హైదరాబాద్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. సూర్య ప్రకాశ్ సంతాపం వ్యక్తం చేశారు. హుషారు పాటలు, లాలి పాటలు, విరహగీతాలలో పాటు సామాజిక స్పృహ, పోరాట స్పూర్తి, ఉన్న పాటలు సైతం పాడి ప్రజాచైతన్యం కల్గించిన ఎస్. జానకి సంగీత సామ్రాజ్యంలో సరస్వతిగా డాక్టర్ సూర్య ప్రకాశ్ అభివర్ణించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మానవత్వం చాటుకున్న కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న

**తప్పిపోయిన బాలుడిని స్వయంగా ఇంటికి చేర్చి తల్లిదండ్రులకు అప్పగింత**

**ట్రాఫిక్ సీఐ ని అభినందించిన స్థానికులు**



కాజీపేట, జూలై 12 (వాయిస్ టుడే): రోడ్డుపై తప్పిపోయి ఏడుస్తున్న ఓ చిన్నారిని గుర్తించి, స్వయంగా ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించి కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న మానవత్వాన్ని చాటుకున్నారు. కాజీపేట జూబ్లీ మార్కెట్‌కు చెందిన మంద రాజు కుమారుడు మంద శివసాయి (5) ఆదివారం సాయంత్రం సమీపంలోని కిరాణా దుకాణంలో చాక్లెట్లు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అయితే దారి తప్పి కాజీపేట డీజిల్ కాలనీ వరకు చేరుకున్నాడు. ఇంటికి వెళ్లే మార్గం తెలియక ఏడుస్తూ తిరుగుతున్న బాలుడిని అదే సమయంలో అటుగా వెళ్తున్న ట్రాఫిక్ సీఐ వెంకన్న గమనించారు. వెంటనే బాలుడి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్న సీఐ, బాలుడిని తన వాహనంలో స్వయంగా తీసుకెళ్లి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. తమ కుమారుడిని క్షేమంగా తిరిగి అందించినందుకు బాలుడి తల్లిదండ్రులు, స్థానికులు సీఐ వెంకన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వెంకన్న మాట్లాడుతూ చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు రోడ్లపై ఆడుకునే సమయంలో వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చిన్నారులు ఎక్కడికి వెళ్తున్నారో గమనించాలని కోరారు. చిన్నారి పట్ల చూపిన శ్రద్ధ, మానవత్వంతో వ్యవహరించిన సీఐ వెంకన్నను స్థానికులు అభినందించారు.



# మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్**

హనుమకొండ, జూలై 12(వాయిస్ టుడే): మైనార్టీలకు సంక్షేమం పైన బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందని.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మైనారిటీ ల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పేద ముస్లిం ల కోసం షాదీఖానా కట్టాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. హనుమకొండ లో మైనార్టీ ముఖ్యులు ఆదివారం షాదీఖానా నిర్మాణం కోసం కేటాయించిన స్థలం విషయమై ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ హనుమకొండ జిల్లా, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వినయ్ భాస్కర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కేసీఆర్ అప్పటి ప్రభుత్వం కాజీపేట మండలం న్యూశాయంపేట 597 సర్వే నంబర్ లోని 25 గుంటల స్థలాన్ని మైనార్టీల కోసం షాదీఖానా నిర్మాణం కోసం నాడు కేటాయించడం జరిగిందని వివరించారు. మైనారిటీ లకు కేటాయించిన స్థలాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తిరిగి తీసుకుందని ప్రశ్నించారు. మైనార్టీ సంక్షేమం కోసం కేటాయించిన స్థలం జోలికి పోవద్దని, తిరిగి వారికే కేటాయించాలని ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో మైనార్టీలతో కలిసి ఉద్యమిస్తానని హెచ్చరించారు. షాదీఖానా కోసం కేటాయించిన స్థలం తిరిగి మైనార్టీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి స్థలాలు ఏవీ లేనట్టు మైనార్టీ ల స్థలాన్నే ఎందుకు లాక్కొంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు గానే చూస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, మైనార్టీ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# అదనంగా నీటి పన్ను పట్ల ప్రజల తీవ్ర ఆందోళన

**ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

**సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని భరోసా**

హనుమకొండ, జూలై 12(వాయిస్ టుడే): వరంగల్ ట్రై సిటీస్ పరిధిలోని అపార్ట్మెంట్లు, అలాగే నగరంలోని కొన్ని వ్యక్తిగత ఇండ్లకు ఇప్పటికే కమర్షియల్ నీటి కనెక్షన్లపై నీటి పన్ను చెల్లిస్తున్నప్పటికీ తాజాగా జారీ చేసిన మున్సిపల్ హౌస్ ట్యాక్స్ నోటీసుల్లో మరోసారి అదనంగా నీటి పన్ను విధించడం పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను జిల్లా అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ని కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను విన్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి హౌస్ ట్యాక్స్‌లో విధించిన అదనపు నీటి పన్నును రద్దు చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రజలకు అన్యాయం జరగకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇవ్వడంతో జిల్లా అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ రెంటాల కేశవరెడ్డి, ఉపాధ్యక్షులు గుండ్ల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్, ఉపాధ్యక్షులు కృపాకర్ రావు, డి.వి. ప్రసాద్, గొట్టిముక్కుల స్వరూప్, సత్యనారాయణ, చిదర అంజనీ దేవి, రవికుమార్, బాలసముద్రం కాలనీ ప్రధాన కార్యదర్శి గుర్రాల ప్రభాకర్ ,మారుకల విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



హనుమకొండ, జూలై 12(వాయిస్ టుడే): జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నేటి నుంచి జిల్లావ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వైద్య, విద్య, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి అవసరమైన సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మొత్తం 2,08,441 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 1--2 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అర మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల వారికి ఒక పూర్తి మాత్ర అందజేయనున్నట్లు తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు పూర్తిగా సురక్షితమైనవని, వాటివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని స్పష్టం చేశారు. పిల్లలను నులి పురుగుల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నులి పురుగుల సంక్రమణ వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, మలబద్ధకం, వాంతులు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అంతేకాకుండా చదువుపై ఏకాగ్రత తగ్గడం, తరచూ అనారోగ్యానికి గురికావడం వంటి సమస్యలు కూడా ఎదురవుతాయని పేర్కొన్నారు. నులి పురుగుల సంక్రమణను నివారించేందుకు భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, ఎల్లప్పుడూ చెప్పులు ధరించడం, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను శుభ్రంగా కడిగి వినియోగించడం, వేడి వేడి మరియు పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, సురక్షితమైన తాగునీటిని వినియోగించడం, బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉండడం వంటి పరిశుభ్రత అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారి ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకునేలా తల్లిదండ్రులు సహకరించి, జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ విజ్ఞప్తి చేశారు.



# "ఉన్న ఊరు కన్నతల్లి లాంటిది".. స్వగ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**మెదక్ ఎస్పీ దేవులపల్లి వెంకట శ్రీనివాస్ రావు**

ఆత్మకూరు/ఇస్తలాపురం, వాయిస్ టుడే: ప్రతి ఒక్కరూ తాము పుట్టిన ఊరును కన్నతల్లిలా భావించి, ఆ గ్రామ అభివృద్ధికి తమ వంతు సేవ చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ దేవులపల్లి వెంకట శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు మండలంలోని ఇస్తలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లిలియూత్ ఫర్ సేవలిలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్ననాటి నుంచి తమ ఎదుగుదలకు తోడ్పడిన స్వగ్రామాన్ని జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా మరవకూడదని, గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సేవ చేయాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని, విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. స్వగ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో సేవా సంస్థల సహకారంతో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.1 లక్ష విలువైన అధునాతన కంప్యూటర్‌ను అందజేయడంతో పాటు విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెయింట్ బాక్స్‌లను అందజేశారు. సీనియర్ జర్నలిస్టు తూడి జనార్ధన్ మాట్లాడుతూ, ఎస్పీ దేవులపల్లి వెంకట శ్రీనివాస్ రావు తాను చదివిన పాఠశాలను, స్వగ్రామాన్ని ఎప్పటికీ మరచిపోకుండా ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుండడం అభినందనీయమని అన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను కూడా ప్రకటించారు. ప్రథమ బహుమతిగా రూ.5,116, ద్వితీయ బహుమతిగా రూ.3,116, తృతీయ బహుమతిగా రూ.2,116 నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ, సర్పంచ్ ప్రమీల, ఉపసర్పంచ్ రాములు, యూత్ ఫర్ సేవ నిర్వాహకులు అరవింద్, విద్యా కమిటీ చైర్మన్ మొరిగాల జానమ్మ, మర్రు బాబూరావు, తూడి నరసింహరావు, సారయ్య, ముత్తయ్య, శ్రీను, పుప్పాల వీరన్న, సాగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఎస్పీని ఘనంగా సన్మానించారు.




# కలం మాత్రమే కాదు. కరుణ కూడా జర్నలిస్టుల ధర్మం

**టి జె యూ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అరుగులపోశెట్టి**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 12: తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ వృద్ధ ఆశ్రమాలలో పండ్లు పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా (టీ జె యూ) అధ్యక్షులు అరుగుల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి మరాజు గంగాధర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సమాజ సేవకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ఇటువంటి మానవతా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. జర్నలిస్టులు వార్తలను అందించడమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో సమాజానికి అండగా నిలవడం కూడా తమ బాధ్యతేనని పేర్కొన్నారు. అలాగే నిర్మల్ జిల్లా జర్నలిస్టుల శ్రేయస్సు కోసం సేవ చేసే అవకాశం కల్పించిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు ఉప్పల లక్ష్మణ్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) సభ్యులు ఫిరోజ్ ఖాన్, అక్రిడిటేషన్ కమిటీ బాధ్యులు ఎలుగు లింగన్న, రాజేందర్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆహ్మద్ ఇంతియాజ్ అలీ , కార్యదర్శి కె రాజ గౌడ్, ఈ సి మెంబర్ ఎండి ఇసాక్ అలీ వృద్ధ ఆశ్రమా ఇంచార్జి గడ్డం రాము, పాల్గొన్నారు.

# లూపిన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు**



హనుమకొండ, జులై12 (వాయిస్ టుడే): "పరుగులు ఆరోగ్యం కోసం... రక్తదానం ప్రాణాల కోసం" అనే నినాదంతో లూపిన్ వరంగల్ కమ్యూనిటీ తమ 15వ రన్ పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండలోని భారత రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి భారత రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జెన్-జెడ్ యువత ఫిట్‌నెస్‌తో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవర్చుకోవాలి. పరుగులు ఆరోగ్యాన్ని పెంపొందిస్తే, రక్తదానం ప్రాణాలను కాపాడుతుంది. యువత స్వచ్ఛంద రక్తదానం, ఆరోగ్య అవగాహన మరియు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరానికి యువత విశేషంగా స్పందించి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సమాజ సేవే లక్ష్యంగా పలువురు యువకులు ముందుకు వచ్చి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి విశేషంగా సహకరించిన కె. దీపక్ రెడ్డి, ఎం. రాజా విక్రమ్ రెడ్డిలకు లూపిన్ కమ్యూనిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

ఈ శిబిరాన్ని లూపిన్ కోర్ టీమ్ సభ్యులు శ్రీకర్ తాటికొండ, విష్పాత్ నమోజు, సిద్ధార్థ్ మాతూరి, గోపు సాత్విక్, వంశీ గౌడ్ బొల్లపెల్లి, శేషు ఎంజాల, విశ్వక్ నోముల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. రక్తదానం చేసిన ప్రతి దాతకు, కార్యక్రమానికి సహకరించిన వాలంటీర్లు, మిత్రులు, శ్రేయోభిలాషులకు లూపిన్ కమ్యూనిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో కూడా ఫిట్‌నెస్‌తో పాటు సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని లూపిన్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ నేహాల్, శృతి, హర్షిణి రెడ్డి, భారత రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియను అప్రమత్తతో భాగస్వామ్యం కావాలి

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

హనుమకొండ, జూలై 12(వాయిస్ టుడే): సర్ పై బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ బాధ్యులతో ఆదివారం సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకమైన దశకు చేరుకుందని అన్నారు. ఎన్యుమరేషన్ ఫామ్స్ ఓటర్లకు చేరాయని, వాటిని ఓటరు వివరాలతో పూర్తి చేసిన ఫామ్స్ బీఎల్వో లకు అందే విధంగా పార్టీ బీఎల్ఏ లు పని చేసేలా చూడాలని సూచించారు. హెల్ప్ డెస్క్ కు మంచి స్పందన వస్తోందని, ఓటర్లకు మరింతగా అందుబాటులో ఉండాలని కోరారు. డివిజన్ల వారీగా ఎస్ఐఆర్ ఏ మేరకు సాగుతుందో అన్న విషయంపై సమాచారాన్ని సేకరించాలని అన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ బాధ్యులు మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు పోలపల్లి రామ్మూర్తి, బైరపాక ప్రశాంత్, గండ్రకోట రాకేష్ యాదవ్, తక్కళ్ళపల్లి వినీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనది

**ఆదివాసి కాంగ్రెస్ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద నాయక్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 12: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైందని ప్రతి ఓటరు కు ఇచ్చిన ఏమున్యరేషన్ జాగ్రత్తగా నింపి ఎన్నికల అధికారులకు పారం అందించాలని ఆదివాసి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హారం నింపి ఇవ్వని పక్షంలో ఓటు ఉండదని ఆయన తెలిపారు. ఏ ఒక్కరూ ఓటు కూడా మిస్ కాకుండా చూసి బాధ్యతగా మన అందరిపై ఉందని ఇంటింటికి వెళ్లి ఓటరుకు కార్యకర్తలు సూచించాలని తెలిపారు.జిల్లాలోని జరుగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) ప్రక్రియ అత్యంత కీలకమైంది అన్నారు ప్రతి ఓటరు హక్కును కాపాడుకోవాలని నిర్లక్ష్యం చేయరాదన్నారు జిల్లాలోని ప్రతి కుటుంబ తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన సూచించారు ఎవరైతే సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. అధికారులు నిస్పక్షపాతంగా పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన కోరారు.

# హక్కుల సాధనకు పోరాటాలే మార్గం

## పాదయాత్ర చేపట్టిన అంగన్వాడీలు



(భద్రాచలం, జూలై 12 ) ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ చాలీ చాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్న అంగన్వాడీ లు పోరుబాట పట్టారు. తమ సమస్యలు పరిష్కారం కు పోరాటమే మార్గం అంటూ నినదించారు. భద్రాచలం నుండి కొత్తగూడెం వరకు రెండు రోజుల పాటు పాదయాత్ర చేస్తూ ప్రభుత్వానికి తమ నిరశన ను వినిపించనున్నారు. తమ పట్ల ప్రభుత్వ వైఖరి ని వ్యతిరేకిస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ అనుబంధ సంఘమైన అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ( ఏఐటీయూసీ ) ఆధ్వర్యం లో అంగన్వాడీ లు ఆదివారం భద్రాచలం నుండి పాదయాత్ర ప్రారంభించారు. అంగన్వాడీల హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలే శరణ్యమని సి పి ఐ జిల్లా కార్యదర్శి ఎస్. కె . సాబీర్ పాషా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి అరుణ, గోనె మణి అధ్యక్షతన జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ చాలీచాలని వేతనాలు ఇస్తూ, అంగన్వాడీ ల పై మోయలేని పనిభారాన్ని మోపుతున్నదని విమర్శించారు. అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వం బానిసలుగా చూస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇదే నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేసి సచివాలయాన్ని ముట్టడిస్తామని పాషా హెచ్చరించారు. ఈ సందర్భంగా మన్యం వీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంగన్వాడీల సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని పలువురు వక్తలు మండిపడ్డారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నిత్యం సేవలందిస్తున్న అంగన్వాడీలపై సంబంధం లేని అదనపు విధులను మోపడం వెట్టిచాకిరీ చేయించడమేనన్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, మరోవైపు అధిక పనిభారంతో అంగన్వాడీల జీవితాలను ప్రభుత్వం దుర్భరంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీల పోరాటానికి సీపీఐ, ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని నాయకులు ప్రకటించారు. హక్కులు సాధించే వరకు ఉద్యమ జెండాను దించేది లేదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే వేలాది మంది అంగన్వాడీలతో సచివాలయాన్ని ముట్టడించి తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. ఐసిడిఎస్ కు సరిపడా బడ్జెట్ కేటాయించాలని నెలకు 18 వేల వేతన హామీని నిలబెట్టుకోవాలని అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బిఎల్ఓ విధుల నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల ఐక్యత, పోరాట స్ఫూర్తితో పాదయాత్ర ఉత్సాహభరితంగా కొనసాగింది. సారపాకలో ఐటిసి కార్మిక సంఘాల నాయకులు హరిప్రసాద్, పోటు రంగారావు, నాగభూషణం పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. రెండవ రోజు పాదయాత్ర సోమవారం జగన్నాధపురం లోని పెద్దమ్మ తల్లి దేవాలయం నుండి ప్రారంభమై కలెక్టరేట్ వరకు సాగనుంది. కలెక్టరేట్ ఎదుట వందలాదిమంది అంగన్వాడీలు అంగన్వాడీ వర్కర్ల తో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ మాడ గణేష్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి కార్యదర్శి నందూరి కరుణకుమారి, రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ సీతామహాలక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు సింగు నరసింహారావు, నరాటి ప్రసాద్ పాల్గొన్నారు.




## రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేసిన కేంద్ర ప్రభుత్వం

### ఎ ఐ కె ఎం స్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 12: అఖిలభారత రైతు కూలి సంఘం (ఎ ఐ కె ఎం స్) నిర్మల్ ఆదిలాబాద్ జిల్లా 11వ మహాసభలు భైంసా మండలం హంపోలి కే గ్రామంలో జరిగాయి. సంఘం జిల్లా అధ్యక్షులు కే సర్దార్ జెండావిష్కరణ చేసి, అధ్యకత వహించగా,సభలను రాష్ట్ర అధ్యక్షులు బిక్షపతి ప్రారంభించారు. రైతాంగం, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, సాగు ఖర్చులు పెరగడం, పంటలకు గిట్టుబాటు మద్దతు ధరలు లేకపోవడం, రుణభారం పెరగడం వల్ల రైతులు సంక్షోభంలోకి నెట్టబడ్డారని అన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు మద్దతు ధర సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ విధానాలు రైతాంగానికి అనుకూలంగా లేవని, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఏ ఐ కె ఎం స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్నలి పాల్గొని మాట్లాడుతూ, రైతులు--కూలీల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గమని పిలుపునిచ్చారు. రైతులకు ఇచ్చిన హామీలను రేవంత్ ప్రభుత్వం విస్మరించ్చిందని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జే రాజు కార్యదర్శి నివేదిక ను ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో ఐ ఫ్ టి యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం హరిత,అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎల్ ఆర్ ఉపాలి, దీనజీ, బాబు, సాయినాథ్, కేశవ్, గణపతి,రాజేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లను నిజమైన పేదలకు కేటాయించాలి

### బి ఆర్ ఎస్ నేత మానే రామకృష్ణ

భద్రాచలం, జూలై 12 ). రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల ను నిజమైన పేదలకు కేటాయించాలనీ బి ఆర్ ఎస్ నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణం లో బిఆర్ఎస్ పార్టీ 17,18 వార్డు ల సమావేశం మండల నాయకులు గోసుల శ్రీనివాస్ అధ్యక్షత న ఆదివారం నిర్వహించారు. సమావేశం లో మానే రామకృష్ణ మాట్లాడుతూ అమలు కానీ హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయాలో అర్థం కానీ పరిస్థితి లో అయోమయం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని అన్నారు... భద్రాచలం పట్టణం లో నిజమైన పేదలకు రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో నిజమైన పేదలకు న్యాయం చేయకపోతే పోరాటం తప్పదని అన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు ఆకోజు సునీల్ కుమార్, రేపాక పూర్ణ చందర్ రావు, బడిశా నాగారాజు, రావూరి రవికిరణ్, బర్ల రమేష్, బత్తుల రుద్ర రామరాజు, మహిళా నాయకులు కావూరి సీతమహాలక్షి, మాజీ ఎంపీపీ శాంతమ్మ, కణితి రాధ, తెల్లం కామేశ్వరి, ఎండీ ముంతాజ్ ఉన్నారు.

## జులై 14న హైదరాబాదులో జరిగే మల్లీ దశ ఉద్యమకారుల గుర్తింపు సమావేశం

**ఈ సమావేశానికి హత్నూర మండల్ ఉద్యమకారులు తరలిరావాలి**

**పట్ల మండల్ మల్లీ దశ ఉద్యమకారుల ఉపాధ్యక్షులు బట్టు మారుతి రాజు**



నర్సాపూర్ (వాయిస్ టుడే) : తెలంగాణ మలిదశ ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జిల్లాల వారీగా గుర్తింపు సమావేశం ఈ నెల 14న (మంగళవారం) హైదరాబాద్‌లోని తెలంగాణ అమర జ్యోతి ప్రాంగణంలో నిర్వహించనున్నారు. మలిదశ ఉద్యమకారులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో గత నెలలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించింది. ఇందులో భాగంగా నలుగురు మంత్రులు మరియు ప్రొఫెసర్ కోదండరాం గారి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే జూలై 14న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ సమావేశానికి హత్నూర మండల పరిధిలోని ఉద్యమకారులందరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని హత్నూర మండల ఉద్యమకారుల సంఘం ఉపాధ్యక్షులు భట్టు మారుతి రాజు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీ ద్వారా నిజమైన ఉద్యమకారులందరికీ తగిన గుర్తింపు లభిస్తుందని, కావున మండలంలోని మలిదశ పోరాట యోధులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



## 26 ఏళ్ల తర్వాత ఒక్కటైన పూర్వ విద్యార్థులు

### దిలావర్‌పూర్‌లో ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 12: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999--2000 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక వేదికపైకి చేరారు. పాఠశాల విద్యను పూర్తి చేసుకుని 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో వారు ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు.

**పాత జ్ఞాపకాల మురిపెం. గురువుల స్మరణ**

చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి దోస్తులను చూసి ఆనందంతో మురిసిపోతూ పాఠశాల రోజుల్లో జరిగిన రకరకాల సంఘటనలను జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో స్మరించుకుంటూ, తమ పాత మధురానుభూతులను అందరితో పంచుకున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత జరిగిన ఈ ఆత్మీయ కలయిక పూర్వ విద్యార్థుల కుటుంబాలలో ఎంతో సంతోషాన్ని నింపింది.

## శక్తివంతమైన మహిళల జాబితాలో నారా బ్రాహ్మణి

### అభినందనలు తెలిపిన బొజ్జల రిషితా రెడ్డి

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)జూలై 12: ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 2026 సంవత్సరానికి గాను విడుదల చేసిన దేశంలోని వంద మంది అత్యంత శక్తివంతమైన మహిళలు జాబితాలో హెరిటేజ్ సంస్థ కార్యనిర్వాహకురాలు నారా బ్రాహ్మణి చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి నాడు పాత్రికేయులకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ వ్యాపార రంగంలో ఆమె చూపుతున్న సమర్థ నాయకత్వం, కష్టం, నిబద్ధత, ప్రజాసేవకు ఇది గుర్తింపుగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఆర్థిక, సాంకేతిక, వైద్య, ఇంధన, అమ్మకాల వంటి కీలక రంగాల్లో ప్రభావం చూపుతున్న మహిళా నాయకులను ఈ పత్రిక ఎంపిక చెయ్యడం జరుగుతుంది అందులో భాగంగా ఇది 29వ సారి విడుదల చెయ్యడం జరిగింది. అందులో ఈ ఏడాది జాబితాలో 94 సంస్థలకు చెందిన మహిళలు ఉన్నారు. వీరంతా కలిపి 1.11 కోట్ల మంది ఉద్యోగులు, 7.3 లక్షల కోట్ల రూపాయల వార్షిక ఆదాయం ఉన్న కంపెనీలకు వీరంతా ప్రాతినిధ్యం వహించడం జరుగుతోందని తెలిపారు. అందులోను 20 దేశాల నుంచి నాయకులు ఉండగా, కేవలం మన దేశం నుంచి నారా బ్రాహ్మణి ఒకరు మాత్రమే ఈ అంతర్జాతీయ జాబితాలో చోటు దక్కించుకోవడం మన రాష్ట్రానికి గర్వకారణమని బొజ్జల రిషితా రెడ్డి అన్నారు.ఈ గుర్తింపు ఈ గౌరవం బ్రాహ్మణి కి దక్కడం మనందరికీ, ప్రత్యేకంగా మహిళా లోకానికి గర్వకారణం. ఆమె కృషికి, సమర్థ నాయకత్వానికి ఇది నిదర్శనం. ఆమె యువతకు, ఎందరో ఆడపిల్లలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలాంటి గొప్ప గుర్తింపులు ఇంకా ఎన్నో ఆమెకు రావాలని, దేశానికి మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని బొజ్జల రిషితా రెడ్డి అన్నారు.





## సీఎం సహాయనిది చెక్కును పంపిణీ చేసిన ముధోల్ మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ భోంస్లే నారాయణ రావు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి ( వాయిస్ టుడే) జూలై 12: నిర్మల్ తానూర్ మండలం ఝరి బి గ్రామానికి చెందిన సగ్గమొల్ల దత్తహరి అనే లబ్ధిదారులకు సుమారు 60,000 డగే శంకర్ అనే లబ్ధిదారునికి సుమారు 60,000 జాదవ్ జలిందర్ అనే లబ్ధిదారునికి 40,000 రూపాయల.సీఎం సహాయ అనేది చెక్కును బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది. చెక్కును మంజూరు చేసి ఇచ్చినందుకు మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి గౌరవనీయులు శ్రీ జూపల్లి కృష్ణారావు ముధోల్ మాజీ శాసనసభ్యులుకాంగ్రెస్ పార్టీ ఇంచార్జి గౌ శ్రీ మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణ రావు పటేల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ చంద్రే తానూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హెచ్.పుండలిక్, ఝరి బి గ్రామ పంచాయతీ సర్పంచ్ బొడ్డోళ్ల బాబన్న ఉప సర్పంచ్ అనిల్ ఝరి బి గ్రామం కాంగ్రెస్ పార్టీ నాయకులు తది తరులు పాల్గొన్నారు.



## డాక్టర్ గోపాలకృష్ణకు ఘన సన్మానం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 12: నిర్మల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ వేణుగోపాలకృష్ణ కు ఎం డి బయో కెమిస్ట్రీ విభాగంలో రాష్ట్రస్థాయి ప్రశంస లభించింది. ఉత్తమ వైద్యునిగా జాతీయ రాష్ట్ర జిల్లా అవార్డులతో పాటు ఉత్తమ కళాకారునిగా నంది పురస్కారం అందుకున్న ఆయన ప్రముఖ ప్రజ్ఞాశాలి కుమారుడు వివేక్ కృష్ణతో కలిసి కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి నీ దర్శించుకున్న సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాస్ దిలావర్పూర్ పోలీస్ సిబ్బంది అమృత్ ఆయనను స్వామి వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ సేవలను పలువురు ప్రశంసించారు.



## కల్లూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ బావేశ్మిశ్రా పర్యటన

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 12: నిర్మల్ జిల్లా కలెక్టర్ భావిష్ మిశ్రా కుంటాల మండలంలో నీ కల్లూరు గ్రామపంచాయతీలో పర్యటించారు. సర్ ఎస్ ఐ ర్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ పర్యటనలో గ్రామంలోని అభివృద్ధి పనులు. ప్రజా సమస్యలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసిన ఆయన సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ప్రభుత్వ పథకాలు సేవలు ప్రజలకు ప్రార్దర్శకంగా వేగంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దశరథ్ ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.



## అర్హులైన అందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తా..

**10 సంవత్సరాల పాలనలో పేదలకు ఇండ్ల మంజూరు కాలేదు**

**ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జులై 12: గత పది సంవత్సరాల పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా ముధోల్ నియోజకవర్గంలో పేదలకు ఇల్లు మంజూరు కాక ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. ఆదివారం తానూర్ మండలంలోని మసల్గా తండా లో ఇద్దరు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దశలవారీగా ఇందిరమ్మ ఇల్లాలు మంజూరు చేయించి, పేదోడి స్వంత ఇంటి కల నెరవేరేలా తన వంతుగా పాటుపడతానని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఇందిరమ్మ ఇండ్లు పేదలకు మంజూరు అవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల కోసం దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని, అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరు చేయిస్తానని చెప్పారు. అదేవిధంగా మారుమూల మండలమైన తానూర్ మండల కేంద్రంలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హామ్ పథకంలో 140 కోట్లతో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, అదేవిధంగా తానూర్ నుండి తండా వరకు రోడ్లు వేయించడం జరుగుతుందన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు మండల సర్పంచులు, నాయకులు, తండావాసులు, ఘనంగా స్వాగతించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, చిన్నారెడ్డి, మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం 13 జూలై 2026

## కరెంట్ షాక్‌తో రైతు మృతి



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 12: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కరెంట్ షాక్ తో ఒక రైతు మృతి చెందిన ఘటన సోన్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం. బొప్పారం గ్రామానికి చెందిన రాచర్ల ముత్యం ఆదివారం పొలం పనులకు వెళ్తుండగా సమీపంలోని ట్రాన్స్ ఫార్మా ర్ లో కరెంట్ చెక్ చేస్తుండగా విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు



## గురుజువాడాలో ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణకు.ప్రజల భాగస్వామ్యం కావాలి

### సర్పంచ్ ప్రియాంక రాజేందర్

ఝరాసంగం జూలై 12 (వాయిస్ టుడే) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం గురుజువాడ గ్రామ పంచాయతీలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ శనివారం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా చర్యలు చేపట్టాలని ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు)కు సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మాట్లాడుతూ, ఓటర్లు తమ వ్యక్తిగత వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన ఆధార పత్రాలను జతచేసి నిర్ణీత గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలని కోరారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన వివరాలు నమోదు కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఈ ప్రక్రియకు దూరం కాకుండా ప్రతి కుటుంబం బాధ్యతగా స్పందించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఆమె, ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామ ప్రజలు ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), యువ నాయకులు శివసాయి, న్యూమాన్, యయా పటేల్, తయార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్

### రూ.1.30 కోట్ల తో సర్దాపూర్ మార్కెట్ యార్డులో నూతన ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 12 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని సర్దాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు లో రూ.1.30 కోట్ల వ్యయం తో నిర్మించనున్న నూతన ప్రహరీ గోడ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథి గా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, రైతులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.మార్కెట్ యార్డుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు పండించిన పంటలను భద్రంగా మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించేం దుకు అవసరమైన వసతులను దశల వారీగా కల్పిస్తున్నామని పేర్కొన్నారు సర్దాపూర్ మార్కెట్ యార్డు లో నిర్మించనున్న ప్రహరీ గోడ పూర్తయితే యార్డు భద్రత మరింత బలోపేతం అవడంతో పాటు మార్కెట్ నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు, వ్యాపారులు, హమాలీలు తదితరులకు అనుకూలమైన వాతావరణం కల్పించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రైతు సంక్షేమానికి అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని విప్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ వేలుమల స్వరూప తిరుపతి రెడ్డి, జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సయ్య గౌడ్, మార్కెట్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నల్లగొండ పట్టణ వ్యాప్తంగా అర్ధ రాత్రి ప్రత్యేక నాకాబందీ

### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 146 వాహనాలు సీజ్, 91 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

### అనుమానితులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ జూలై 12(వాయిస్ టుడే): నల్గొండ పట్టణ పరిధిలో శనివారం అర్ధ రాత్రి ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీ, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు.పట్టణ పరిధిలో మొత్తం 17 చెకింగ్ పాయింట్లలో 07 మంది సీఐలు, 24 మంది ఎస్ఐలు ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొని వాహనాలను, అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 91 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులను గుర్తించి కేసులు నమోదు చేశారు. 30 ట్రిపుల్ రైడింగ్, 09 మైనర్ డ్రైవింగ్ కేసులు



నమోదు చేయగా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 04 మోడిఫైడ్ సైలెన్సర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అలాగే నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 73 వాహనాలు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన 97 మంది, వాహన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న 81 మందిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. మొత్తం 146 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.పాపిలాన్ పరికరం ద్వారా ఇద్దరు అనుమానితులను గుర్తించి వారి వివరాలను పరిశీలించారు. అలాగే 12 మంది రౌడీ షీటర్లను తనిఖీ చేసి, వారి కదలికలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు అమర్చిన 02 బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి 134 ఈ–చలాన్లు, ఇతర ఉల్లంఘనలకు సంబంధించి 11 ఈ–పెట్టి కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాల రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, మైనర్లతో వాహనాలు నడిపించడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలు తీవ్రమైన రోడ్డు ప్రమాదాలకు దారితీస్తాయని అన్నారు.ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రజల భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాలు జిల్లాలో నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,సి. ఐ లు ,ఎస్. ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.



## తమ ఓటు ఉండాలంటే ఎస్ఐఆర్ చేసుకోవాల్సిందే లేకుంటే ఓటు హక్కు పోయే ప్రమాదం ఉంది

### మాజీ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్,జూలై 12(వాయిస్ టుడే): నగరంలోని ఓటర్ల సహాయార్థం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు మరియు సవరణల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలను (హెల్ప్ డెస్క్‌లను) ఏర్పాటు చేశామని మాజీ మంత్రి,ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నగరంలో నీ చింతకుంటలో శాంతినగర్ చౌరస్తా వద్ద బి.అర్.ఎస్ ఏర్పాటు చేసిన ఎస్.ఐ.ఆర్ (ప్రత్యేక ఓటర్ సవరణ)సహాయ కేంద్రాలను మాజీ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్,నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ మాజీ వైస్ ఎంపీపీభూక్యా తిరుపతి నాయక్ గంగుల కమలాకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేయడమే వీటి ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం మరియు బి.ఎల్.ఓ ల సమన్వయ లోపం వల్ల నగరంలో ఇప్పటివరకు కేవలం 14 శాతం మాత్రమే ఓటరు సవరణ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.జూలై 24 లోపు మిగిలిన ప్రక్రియను ముగించాల్సి ఉందని, ఆన్‌లైన్ సర్వర్లు సరిగ్గా పనిచేయక పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.అందుకే బీఆర్ఎస్ పార్టీ స్వయంగా రంగంలోకి దిగి,10 కేంద్రాల ద్వారా ప్రజలకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను పూర్తి చేసేందుకు ఉచిత సేవలు అందిస్తోందని,ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలి అని పిలుపునిచ్చారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కోలగాని శ్రీనివాస్

కరీంనగర్,జూలై 12(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని 1వ డివిజన్ హనుమాన్ నగర్‌లో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద 12.80 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు,డ్రైనేజీలు,వీధి దీపాలు,పారిశుద్ధ్య సదుపాయాలు తదితర అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన రహదారులు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని,నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి కొనసాగుతుందని మేయర్ అన్నారు. అనంతరం స్థానిక ప్రజలు తమ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ నగర మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

## పేద ప్రజల పాలిట వరం సీఎం సహాయనిధి

### కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్



కరీంనగర్,జూలై 12(వాయిస్ టుడే): పలు ఆరోగ్య సమస్యల నిమిత్తం వెంకటేష్ చికిత్స చేయించుకుని ఆర్థిక సహాయార్థం సీఎం సహాయ నిధి కొరకు మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఆశ్రయించారు.వారికి సీఎంఆర్ఎఫ్ సహాయం మంజూరుకాగా, రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి,ఆదర్శ నగర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మెతుకు కనకయ్య, విజయలక్ష్మి,ఓ.మల్లయ్య,జగ్గారెడ్డి, గంధం లక్ష్మీనారాయణ,ఓ.రమణ, ఇట్టినేని శ్రీనివాస్,రాజ నరసయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి సహాయంతో మున్నూరు కాపు భవనంలో బోరు బావి



కరీంనగర్,జూలై 12(వాయిస్ టుడే): నగరంలోని మంకమ్మతోటమున్నూరు కాపు సంఘ భవనానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చిన ప్రకారం సంఘ భవనంలో బోరు వేశారని మంకమ్మతోట సునీల్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ముప్పిడి సునీల్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ సంఘం భవన నిర్మాణానికి రెండు విడుతల 5 లక్షలు ఒకసారి తదుపరి ఐదు లక్షలు ఇస్తాను అని మాట ఇచ్చి ముందుండి కేంద్ర మంత్రితో మాట్లాడి మంజూరు చేసిన అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బండి ప్రశాంత్ దీపక్ వ్యక్తిగతంగా మరియు సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దిండిగాల మహేష్,కుల పెద్దలు పల్లె రామచంద్రం, దిండిగాల రమేష్,ఏ దేవేందర్,కటకం రాములు,గుర్రాల వెంకటరమణ, కంజర్ల రేణుక,బత్తుల రవీందర్, జొన్నలగడ్డ అశోక్, ఎడ్ల మల్లేశం, కూరగాయల తిరుపతి, కిషన్ రెడ్డి, రాజన్న, బండి ప్రమోద్,దీపక్,ఏన్నం చిరంజీవి పాల్గొన్నారు.

# కొలువుల కొట్లాటకై వేలాదిగా తరలిరండి

### జులై 15న జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి




కరీంనగర్,జూలై 12(వాయిస్ టుడే): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 15న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సిపిఎం జిల్లా కార్యాలయం ముకుంద లాల్ మిశ్రాభవన్లో మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విభాగాల్లో లక్షల్లో కొలువులు ఖాళీగా ఉన్నాయని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నప్పటికీ హామీని నెరవేర్చలేదన్నారు.ఉద్యోగాల కోసం ప్రశ్నించే యువతకు సమాధానం చెప్పాల్సిన పాలకులు పకోడీలు బజ్జీలు వేయడం కూడా ఉద్యోగాలే అంటూ వ్యాఖ్యలు చేయడంఅత్యంత బాధ్యతారాహితమైన వైఖరిఅన్నారు. పార్లమెంటులో ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం కేంద్ర మంత్రిత్వ శాఖలో దాదాపు 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని,అలాగే సెంట్రల్ యూనివర్సిటీలు,ఐఐటీలు,ఐఐఎం, లతోపాటు ట్రిబుల్ ఐటీలు,నీట్ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇతర ఉన్నత విద్యా సంస్థలు కేంద్ర ప్రభుత్వ విద్యాలయాల్లో దాదాపు 37వేల ఉద్యోగాలు భర్తీకి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలపై యూత్ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు.

స్వయంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ హైదరాబాదులో నిరుద్యోగులతో మాట్లాడుతూ కాంగ్రెస్ వస్తే నిరుద్యోగుల బతుకులు మారుతాయి అని భరోసా ఇచ్చారన్నారు.మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు గడుస్తున్న కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందన్నారు.ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలు చేయకుండా నోటిఫికేషన్లు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు 9000 మంది పదవీ విరమణ పొందుతున్నారని,ఈ విధంగా రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్న్,యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలన్నారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు అన్నిటిని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.జూలై 15న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నాలో యువకులు,నిరుద్యోగులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్,జి రాజేశం, నాయకులు రాయి కంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య,మాతంగి శంకర్, చల్ల లక్ష్మణ్,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**